క్లుప్తంగా

శాస్త్రీయ సమాజాన్ని ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

గిద్దలూరు రూరల్: సైన్స్ అంటే రసాయనాలు, పరిశోధనలే కాదని సమాజంలో సమస్యలు వెలికితీసి శాస్త్రీయ సమాజాన్ని ఏర్పాటు చేసేదని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక 18వ మహాసభల సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైన్స్ తగ్గిపోయే కొద్దీ చాదస్త భావాలు పెరిగి సమాజానికి హాని కలిగిస్తాయన్నారు. వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్య పరిచేందుకు జనవిజ్ఞాన వేదిక ప్రయత్నిస్తోందన్నారు. సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలను పారదోలాల్సి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు పి.స్వరూపారెడ్డి, డాక్టర్ భూమా నరసింహారెడ్డి, డి.జి.బ్రహ్మానందరెడ్డి, మాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

కంభం: నిష్కళంక సేవకు ప్రతి రూపం లయన్స్ క్లబ్ అని క్లబ్ తాజా మాజీ గవర్నర్ గోపీచంద్ పేర్కొన్నారు. ఆదివారం కంభంలో నిర్వహించిన 2025–26 కంభం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా తన్నీరు బాలరంగారావు, కార్యదర్శిగా సిరిగిరి వెంకట్రావు, కోశాధికారిగా పి.వెంకట గుండయ్య, ఉపాధ్యక్షులుగా జలపాటి తులసి ప్రసాద్, నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా జి.సత్య రామారావు, సర్వీస్ కమిటీ చైర్మన్‌గా సయ్యద్ జాకీర్ హుస్సేన్, మెంబర్‌షిప్ చైర్మన్‌గా మొగల్ మహబూబ్ బేగ్, డైరెక్టర్లుగా పార్శ శంకర్, కాశయ్య, మహబూబ్ బాషా తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నామినేని మోహన్‌రావు, వెంకటసుబ్బయ్య, పులి శ్రీనివాస ప్రసాద్, బైసాని వెంకటరామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేయాలి


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని, అప్పటి వరకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీరాములు, సంఘ నాయకుడు పి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తమ కార్యాలయం వద్ద సంఘ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు మంజూరు చేయాలని, సరెండర్ లీవ్ బకాయిలు డిమాండ్ చేశారు. పశ్చిమ ప్రకాశంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల స్థానంలో విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.ప్రభాకర్, జయరామిరెడ్డి, రాజేష్, చెన్నారెడ్డి, పాపాయ్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు


జూదరులతో ఎస్సై, పోలీస్ సిబ్బంది

బేస్తవారిపేట: మండలంలోని పెంచికలపాడు సమీపంలో పొలాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.27,240 నగదు స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల సమాచారం అందించాలని కోరారు.

బైకు అదుపుతప్పి ఒకరికి గాయాలు


సంఘటన స్థలంలో ఏసు

మార్కాపురం: బైకు అదుపుతప్పి ఒకరికి గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం స్థానిక రాయవరం ఫ్లైఓవర్ దగ్గర చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ఎస్టేట్‌లో నివాసం ఉండే ఏసు టూవీలర్‌పై వెళ్తూ అదుపు తప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గుర్తించి ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు తరలించారు.


బేస్తవారిపేట : అక్కపల్లె బస్టాండ్ వద్ద తారురోడ్డు దుస్థితి ఇదీ..


బేస్తవారిపేట : గలిజేరుగుళ్ల బస్టాండ్ వద్ద మురుగు


బేస్తవారిపేట : సింగరపల్లెలో తారు రోడ్డు దుస్థితి

గోతుల మార్గం.. నిత్య నరకం

రాకపోకల సమయంలో వాహనదారులకు తప్పని తిప్పలు

- బేస్తవారిపేట–కోనపల్లె లోయ రోడ్డు పూర్తిగా ధ్వంసం
- రోజూ నరకం చవిచూస్తున్న 30 గ్రామాల ప్రజలు
- ఆర్‌అండ్‌బీ మంత్రి మరమ్మతులు ప్రారంభించినా మారని పరిస్థితి
- రాచర్ల మండలంలో దారుణంగా గ్రామీణ రోడ్ల పరిస్థితి

సంక్రాంతిలోపే రోడ్లను బాగు చేస్తామని ప్రగల్భాలు పలికింది కూటమి ప్రభుత్వం. కొత్త అల్లుళ్లు వచ్చే సరికి పల్లె రోడ్లు సుందరంగా ఉండాలని స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరకు అంతా సెలవిచ్చారు. ఇదంతా జరిగి 8 నెలలైంది కానీ రోడ్ల పరిస్థితి మారలేదు. గోతులు పడి, రాళ్లు తేలిన రోడ్లపై రాకపోకలు సాగించలేక వాహనదారులు నిత్య నరకం అనుభవిస్తున్నారు. మెయిన్ రోడ్లు, లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు ఇలా ఈ రోడ్డు చూసినా దారుణంగా ఉన్నాయి.


బేస్తవారిపేట : కోతకు గురైన కోనపల్లె లోయ రోడ్డు మార్జిన్

బేస్తవారిపేట: రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని గొప్పగా చెప్పిన కూటమి ప్రభుత్వం.. గుంతల రోడ్లపై తట్టెడు కంకర కూడా పోయలేదు. మరమ్మతు పనుల ప్రారంభం పేరుతో డ్రామాను రక్తి కట్టించిన నాయకులు ప్రస్తుతం కిమ్మనడం లేదు. మరమ్మతులకు మంజూరు చేసిన నిధులు ఏమయ్యాయో చెప్పేందుకు ఏ అధికారి సాహసించడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వివరాల్లోకి వెళ్తే.. బేస్తవారిపేట మండలంలోని కోనపల్లె లోయ రోడ్డు దారుణంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లు దెబ్బతిని లోతైన గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో రాత్రి వేళ ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే కోనపల్లె లోయ రోడ్డు అభివృద్ధిపై పాలకులు దృష్టిపెట్టాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

మురుగు తటాకాలుగా బస్టాండ్లు

బేస్తవారిపేట మండలంలోని ఎంపీ చెరువు, అక్కపల్లె, గలిజేరుగుళ్ల, శింగరపల్లె బస్టాండ్లు మురుగు తటాకాలను తలపిస్తున్నాయి. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రోజుల తరబడి నిల్వ ఉండి రోడ్డంతా ఛిద్రమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. మోకాలి లోతున నిలిచిన నీటిలో వెళ్లలేక ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు నరక యాతన అనుభవిస్తున్నారు. గుంతల్లో మోటార్‌సైకిళ్లు అదుపు తప్పి పలువురికి గాయాలైన సంఘటనలు ఉన్నాయి.

మంత్రి ప్రారంభించినా మారని తీరు

కోనపల్లె ఆర్‌అండ్‌బీ తారురోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులను ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి గత ఏడాది డిసెంబర్ 13వ తేదీన ప్రారంభించారు. 2025 జనవరి నెల చివరినాటికి రోడ్లపై గుంతలు లేకుండా తీర్చిదిద్దుతామని గొప్పగా ప్రకటించారు. మంత్రి స్వయంగా పనులు ప్రారంభించిన రోడ్డు మరమ్మతులు 8 నెలలుగా పూర్తి కాలేదు. దాదాపు 30 కిలోమీటర్లు ఉండే కోనపల్లె రోడ్డుకు కాంట్రాక్టర్ అక్కడక్కడా తూతూమంత్రంగా ప్యాచ్‌లు వేసి చేతులు దులుపుకొన్నారు. రహదారిని బాగు చేయడానికి ఎన్ని నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారని ప్రశ్నిస్తే సమాధానమిచ్చే వారే కరువయ్యారు.


మార్కాపురం : బురదమయంగా మారిన రాయవరం రోడ్డు

రోడ్డు ఇలా.. నడిచేదెలా?

మార్కాపురం: మండలంలోని రాయవరం ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి పక్క నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారిపై వర్షం నీరు నిల్వ చేరి బురదమయం కావడంతో రాకపోకలకు విఘాతం కలుగుతోంది. బురద గుంత పక్క నుంచి వెళ్లేందుకు ప్రయత్నించిన ద్విచక్రవాహనదారులు.. బంక మట్టి కావడంతో టైర్లు జారి కింద పడుతున్నారు. పైగా రోజుల తరబడి మురుగు నీరు ఉండటంతో దోమలు పెరిగిపోయి రాత్రిపూట నిద్ర కరువవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


బేస్తవారిపేట : ఎంపీ చెరువు బస్టాండ్ వద్ద ఛిద్రమైన రోడ్డు


రాచర్ల : అనుమలవీడులో సీసీరోడ్డుపై నిలిచిన వర్షం నీరు


రాచర్ల : గంగంపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా మారిన గుంత


రాచర్ల : గోతులమయమైన అంకిరెడ్డిపల్లె రహదారి

హతవిధీ.. ఇవి రోడ్లేనట!

రాచర్ల: మండలంలోని దద్దవాడ–గుడిమెట్ట మార్గంలోని అంకిరెడ్డి పల్లె రోడ్డు మూడు కిలోమీటర్ల మేర గుంతలమయంగా మారింది. అనుమలవీడు క్రాస్ రోడ్డు నుంచి గంగంపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డుపై భారీ గోతులు ఏర్పడటంతో రాకపోకల సమయంలో వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. ఈ రోడ్లపై తరచూ ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. వర్షం కురిస్తే రోడ్లపై నీరు నిల్వ చేరి వాగులను తలపిస్తున్నాయి. అనుమలవీడు ఎస్సీ కాలనీ వెళ్లే సిమెంట్ రోడ్డు తటాకంలా మారింది. పాలకులు స్పందించి రోడ్ల నిర్మాణంపై దృష్టిపెట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిల్లచెట్లలో చెత్త బండి!


నాగంపల్లి ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనం

కొనకనమిట్ల: ఇళ్లలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వాహనాలను కూటమి ప్రభుత్వం రాగానే మూలనపడేశారు. కొనకనమిట్ల మండలంలోని నాగంపల్లి ఎస్సీ కాలనీలో చిల్లచెట్ల నడుమ చెత్త సేకరణ వాహనం ఏడాది కాలంగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. లక్షల రూపాయలు ఖర్చు చేసి గత ప్రభుత్వంలో కేటాయించిన ఈ వాహనాన్ని ఇలా పక్కనపెట్టడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ఉపన్యాసాలిచ్చే పాలకులు చెత్త సేకరణ వాహనాన్ని ఎందుకు వినియోగించడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

నమ్మండి.. ఇది బస్ షెల్టరండి!


దేవిరెడ్డిపల్లిలో చిల్లచెట్ల నడుమ బస్ షెల్టర్

కొనకనమిట్ల: ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు పలు చోట్ల నిరుపయోగంగా మారగా.. మరికొన్ని ప్రాంతాల్లో నిలువనీడ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని వింజవర్తిపాడు పంచాయతీ దేవిరెడ్డిపల్లి బస్టాండ్ వద్ద 2008లో అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి నిధులతో బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. దేవిరెడ్డిపల్లి, వింజవర్తిపాడు గ్రామాల ప్రజలు మార్కాపురం, గొట్లగట్టు, పొదిలికి ప్రయాణించే సమయంలో షెల్టర్ వద్ద వేచి ఉండేవారు. ఈ షెల్టర్ చుట్టూ చిల్లచెట్లు పెరగడంతో ప్రయాణికులు రోడ్డుపై నిల్చుని బస్సులు, ఆటోలు ఎక్కుతున్నారు.

విద్యార్థులకు చదువుపై ఆసక్తి కల్పించాలి


ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులు

గిద్దలూరు రూరల్: విద్యార్థులకు చదువుపై ఆసక్తి కల్పించేందుకు 'చదవడం మాకిష్టం' లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్యయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించడంతోపాటు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధతో అభ్యసించాలని విద్యార్థులకు వక్తలు సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు నల్లబోతుల ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం టౌన్: రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆద్యంతరం ఉత్సాహంగా గడిపారు. చిన్ననాటి సంగతులు, తరగతి గదుల్లో చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ అపూర్వ కలయికకు మార్కాపురం మండలంలోని వేములకోట జెడ్పీ హైస్కూల్ వేదికగా నిలిచింది. హైస్కూల్లో 2003–04లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులంతా హాజరై మిత్రులతో సంతోషంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, అన్విలాషిని, చలపతిరావు, మహేశ్వరరెడ్డి, లక్ష్మీకుమారి, కె.ఆంజనేయరెడ్డితో పాటు ప్రస్తుత హైస్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కె.మల్లికార్జున, ఎ.శివకృష్ణ, జీఎల్ నారాయణ, ఆర్.ఆంజనేయులు మిత్రులు అభినందించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

అర్ధవీడు: మండలంలోని అంకభూపాలెం గ్రామంలో బొడ్రాయి తాతకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు ఉపవాసం ఉండి గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు.

గ్రామ దేవతకు పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం–తర్లుపాడు రోడ్డులోని అల్లూరి పోలేరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ శర్మ ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి మొక్కులు చెల్లించారు.

రేపు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కొనకనమిట్ల: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న గొట్లగట్టు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించనున్నట్లు డాక్టర్లు ఎస్పీ బాలయ్య, నరేంద్రకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలు, గురుకుల పాఠశాలల్లో 4100 మంది విద్యార్థులతో మాత్రలు మింగించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. 12న అందుబాటులో లేని పిల్లలకు 20వ తేదీన మాత్రలు మింగిస్తామని తెలిపారు.

ఎన్ఎంయూ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు

మార్కాపురం: ఆర్టీసీ ఉద్యోగుల(ఏపీపీటీడీ) సమస్యల పరిష్కారానికి ఎన్ఎంయూ కృషి చేస్తోందని నూతనంగా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన సీహెచ్ శ్రీనివాసులు, భవనం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎన్ఎంయూ సమావేశం డిపో ఎదురుగా ఉన్న ఈశ్వరమ్మ గుడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బి.వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ హుస్సేన్ సాహెబ్, కె.శివారెడ్డి, కోశాధికారిగా పి.వెంకటేశ్వర్లు, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ హనీఫ్, బి.సత్యనారాయణరెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. టి.మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి వైఎస్ ప్రసాద్, నాయకులు నాగిరెడ్డి, ఎస్ ప్రసాద్, షేక్ దస్తగిరి, మూర్తయ్య, బాషా, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లు రద్దు చేయాలి


- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు డిమాండ్

అర్ధవీడు: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆదిత్య పాఠశాల ఆవరణలో సీఐటీయూ మండల మహాసభను మండ్ల వలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రద్దు చేసిన 40 కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమిస్తేనే కార్మిక అనుకూల చట్టాలు అమల్లోకి వస్తాయన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అన్వర్ బాషా మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, క్లెయిములు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు సెప్టెంబర్ 15న రాష్ట్ర కార్మిక కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. మహాసభకు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి గోనా మోహన్‌రావు సంఘీభావం తెలిపారు. సీఐటీయూ నాయకులు దానం తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్‌గా మండ్ల వలి, కో కన్వీనర్‌గా భారతి, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

వైభవంగా పట్టాభిరాముడి విగ్రహ ప్రతిష్ఠ


నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలు

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతా లక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి ఆలయ విగ్రహ, ధ్వజ స్తంభ, శిఖర కలశ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ పర్యవేక్షణలో హోమాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సీతారాముల శాంతి కల్యాణం కమనీయంగా సాగింది. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు